# అంచు

**రా**ణి ఉత్తరానికి జవాబుగా మొదట్లో పెద్ద ఉత్తరమే రాయాలనుకున్నాను. బాగా ఆలోచించాక రాయటం అనవసరమనిపించింది. అసలు ఎనిమిది సంవత్సరాల తర్వాత ఆమె నుండి ఉత్తరం వస్తుందని నేను ఊహించలేదు. ఆ ఉత్తరం రాసింది ఆమేనా అని అనుమానం వేసింది. ఆమె దస్తూరి గుర్తులేదు. అంతకు ముందెప్పుడూ నాకు ఉత్తరాలు రాయలేదు. ఆమె ఇక్కడకు రావటం నాకు ఇష్టంలేదు. చివరకు ఆ విషయం చెప్పేయటం మంచిదనిపించి, "నువ్వు రాకు. విడాకులకు నాకు ఎటువంటి అభ్యంతరం లేదు" అని పదిహేను రోజుల తర్వాత రాసి పోస్టు చేసిన రెండు గంటల తర్వాత తను మరుసటి రోజు జి.టి. ఎక్స్‌ప్రెస్‌లో న్యూఢిల్లీ వస్తున్నట్లు ఇచ్చిన టెలిగ్రాం అందింది.

మా పెళ్ళి అనుకోకుండా జరిగింది. పదిరోజుల్లో పెళ్లిచూపులు, పెళ్ళి జరిగిపోయాయి. నేను అందగాడినేం కాదు. రాణి లాటి అందగత్తె నాకు భార్య అవుతుందని నేను ఊహించని విషయం. అందమయిన భార్య కావాలని నేను ఎప్పుడూ కోరుకోలేదు. పెళ్ళయిన రెండోరోజుకే నేనెంత పొరపాటు చేశానో అర్థమయింది. నాకు అమ్మానాన్న ఉంటే ఈ విధంగా జరిగి ఉండేది కాదు. మా బాబాయి మాంచి డబ్బున్న సంబంధం రా అని తొందర పెడితే నేను ఆశపడిన మాట అబద్ధం కాదు.

నా సెలవులు గడిచాక తిరిగి ఢిల్లీ వచ్చేస్తూ రాణిని నా కూడా రమ్మంటే "కొన్ని ఆనవాయితీలుంటాయి. మా వాళ్ళెవరో వచ్చి నన్ను మీ దగ్గిర వదిలిపెడతారు" అంది. ఆరునెలల తర్వాత కూడా ఆమె వస్తున్న సూచనలు కనిపించకపోయేసరికి నేనే నెల్లూరు వెళ్లి "రాదల్చుకోలేదా?" అడిగితే "ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఈ ఊరొదిలి పెట్టడానికి నా మనసు వప్పుకోవటం లేదు. రావాలనిపించటం లేదు. మీ ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చి మా ఇంట్లో ఉంటే నష్టం ఏమిటి?" ఈ మాటలు అంటున్న రాణి నాకు కొత్తగా అవుపించింది.

"అంత మంచి ఉద్యోగం ఇక్కడ రాదు" అన్నాను.

పక పక మని నవ్వి. "అంత మంచి ఉద్యోగమా మీ ఉద్యోగం?" అడిగింది.

"మంచి ఉద్యోగమే."

"........ "

"ప్రమోషన్లు ఉంటాయి. సెంట్రల్ గవర్నమెంటు జాబ్."

"ఆ జాబ్ తీసి తుంగలో తొక్కు స్వామీ. ఇప్పుడు మనకేం తక్కువ? మీరంత దూరంలో ఉద్యోగం చేయటం నా ఖర్మ కాకపోతే ఏమిటి? కాదూ కూడదూ మీకు ఉద్యోగం కావాలంటే చెప్పండి. నాన్నగారు తలుచుకుంటే మీకు ఇక్కడ మంచి ఉద్యోగమే దొరుకుతుంది... ఆలోచించండి... ఆరు నూరయినా నూరు ఆరయినా నేను మటుకు మీ ఊరు రాలేను. రాను" అంది.

వాళ్లింట్లో నాకు ఎటువంటి గౌరవం లేదని నాకు తెలుసు. ఉన్న మంచి ఉద్యోగం వదిలేస్తే నా బతుకు ఇక్కడ ఎంత నికృష్టంగా ఉంటుందో నేను ఊహించగలను. అప్పటికే వాళ్లింట్లో అడపాదడపా అవమానాలు రుచి చూశాను. కొన్ని రాణి సమక్షంలోనే జరిగాయి. ఎవరికీ చెప్పుకోలేనివి. మా బాబాయి అప్పటికే చనిపోయాడు.

ఏడు సంవత్సరాల కిందట నేను రాణికి టెలిగ్రాం ఇచ్చి నెల్లూరు వెళ్లాను. నా ఉద్దేశం తాడో పేడో తేల్చుకుందామనే. ఆమె పెద్దన్నయ్య మటుకు మర్యాద పూర్వకంగా పలకరించి ముందు గదిలో కూర్చోపెట్టి కుశలప్రశ్నలు అడుగుతుంటే నా కళ్ళు రాణి కోసం వెతుకుతున్నాయి. "ఇప్పుడే బండి దిగాను. నేను వస్తున్నట్లు టెలిగ్రాం ఇచ్చాను. అందలేదా?" అడిగాను.

"అందింది"

"రాణి ఇంట్లో లేదా?"

"లేదు. ఎక్కడికో వెళ్ళింది?"

"ఎప్పుడు వస్తుంది?"

"ఇప్పటికే రావాలి. వస్తుంది. కూర్చోండి. నాకు బయటకు వెళ్ళే పనుంది. వస్తాను." అతను వెళ్ళిపోయాడు.

సూట్‌కేస్ కుర్చీ పక్కనే పెట్టి అలానే కూర్చున్నాను. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. ఇంట్లో ఎవరయినా ఉన్నారో లేదో తెలియటం లేదు. టెలిగ్రాం ఇవ్వకుండా వచ్చి ఉండాల్సింది. విసుగు కలుగుతోంది. గంటఅయింది. మరో అరగంట కూర్చోగలిగాను. నామీద నాకే అసహ్యం వేసింది. లేచి సూట్‌కేస్ తీసుకుని రోడ్డుమీదకు వచ్చాను.

ఖాళీ రిక్షా నన్ను దాటుతోంది. "రిక్షా" పిలిచాను. రిక్షా ఆగింది. సూట్‌కేస్ రిక్షాలో పెట్టి ఎక్కి కూర్చుని "దగ్గర్లో మంచి హోటలు ఏదయినా ఉందా?" అడిగాను.

"ఆ కనబడే సెంటర్ లో ఉంది."

"హోటలకు వద్దులే. స్టేషన్‌కు పోనీయి."

రిక్షా కదిలింది. రిక్షాలోంచి రాణి వాళ్ల ఇంటివైపు చూశాను. కిటికీలోంచి రిక్షా వంక ఎవరో చూస్తున్నట్లనిపించింది. పరీక్షగా చూశాను. రాణి. నేను పొరబడ లేదు.

వికలమయిన మనసుతో ఢిల్లీ తిరిగి వచ్చి రాణిని నా దగ్గిరకు పంపమని వాళ్ళ నాన్నగారికి రిజిస్టర్డ్ ఉత్తరం రాస్తే జవాబు రాలేదు. ఆ తర్వాత వాళ్ల గురించి ఆలోచించటం మానేశాను.

ఇన్ని సంవత్సరాల తర్వాత రాణి ఇక్కడకు రావటం నాకు ఎంత మాత్రం ఇష్టం లేని విషయం. నేను స్టేషనుకు వెళ్ళి ఆమెను రిసీవ్ చేసుకోకపోతే ఆమె సరాసరి ఆఫీసుకు వచ్చినా రాగలదు. న్యూసెన్స్ క్రియేట్ చేయనూగలదు. అటువంటి ఇబ్బంది పాలుకావటం నాకు ఇష్టంలేదు. మరుసటిరోజు న్యూఢిల్లీ స్టేషన్ చేరుకునేసరికి అప్పటికి జి.టి. ఎక్స్‌ప్రెస్ వచ్చి పదినిమిషాలయింది. ప్లాట్‌ఫాం మీదకు వచ్చి మొదటి పెట్టె నుండి చివరి పెట్టె వరకు రాణి కోసం వెతికాను. కనబడలేదు. చాలా సంవత్సరాల తర్వాత అవటాన మనిషి మారిపోయి ఉంటుంది. అందువలన నేనుగుర్తు పట్టటం జరగలేదేమోనని మరోసారి వెతికాను. రాణి రాలేదు. నాకెంతో సంతోషంగా ఉంది. చివరి నిమిషంలో తన ప్రయాణం రద్దు చేసుకుని ఉండొచ్చు. ఉత్సాహంగా బయటకు రాబోతూ ఆగిపోయాను. క్లోక్‌రూం పక్కనే రాణి నిలబడి ఉంది. మనిషి రూపు రేఖల్లో చాలా మార్పు ఉంది. కళ్ళ కింద నల్లటి గీతలు స్పష్టంగా అవుపిస్తున్నాయి. నా ఉత్సాహం ఆవిరయింది.

రాణి నా దగిరకు వస్తూ, "మీరు రారనుకున్నాను" అంది.

నవ్వి, "ఎలా ఉన్నావు?" అడిగాను.

"పదండి. మీతో చాలా మాట్లాడాలి. నామీద కోపం పోయిందా?"

అవును అనలేదు, కాదు అనలేదు. నన్ను నేను దగా చేసుకోవటం ఇష్టంలేదు.

"ఒక్కదానివే వచ్చావేమిటి?" అడిగాను. ముందుకు నడుస్తూ.

ఆమె నా పక్కనే నడుస్తూ, "మా వాళ్ళు నన్ను బండి ఎక్కించటానికి స్టేషన్‌కు కూడా రాలేదు" అంది.

"ఎందుకు?"

"ఇప్పుడు నా పొడ వాళ్ళకు గిట్టటంలేదు."

"పోట్లాడుకున్నారా?"

"ఊ."

"మీ ఆరోగ్యం ఎలా ఉంది?"

"నా ఆరోగ్యానికేం? నిక్షేపంగా ఉన్నాను."

"హోటలు తిండి పడుతోందా?"

"హోటలు తిండి మానేసి చాల కాలమయింది."

"వంట మీరే చేసుకుంటున్నారా?"

"లేదు."

బయటకు వచ్చి టాక్సీలో కూర్చున్నాం. నేను డ్రైవరు పక్కనే కూర్చుని ఎక్కడికి వెళ్లాలో చెప్పాను. టాక్సీ కదిలింది. "వెనక్కొచ్చి నా పక్కనే కూర్చోవచ్చు కదా?" అంది.

"ఇతనికి దారి చూపించాలి కదా, అందుకే ఇక్కడ కూర్చున్నాను. చెప్పు. ఈ జన్మలో నీలో మార్పు వస్తుందని నేను అనుకోలేదు. అసలు నువ్విక్కడకు రాకుండా ఉండాల్సింది. రావద్దని ఉత్తరం రాసి పోస్టు చేశాక నీ టెలిగ్రాం అందింది" అని వెనక్కి తిరిగి చూశాను. రాణి చేతులు జోడించి నాకు నమస్కరిస్తూ ఏదో చెప్పబోయింది. గొంతు పెగిలి మాటలు రాలేదనుకుంటాను. తలతిప్పి రోడ్డు పక్కనే పారిపోయే పెద్ద భవనాల వంక చూస్తూ రుమాలుతో కళ్లు అద్దుకుంది.

టాక్సీ మాక్వార్టర్స్ ముందు ఆగింది. దిగి మీటరు చూసి డబ్బులిచ్చాను. రాణి దిగింది. సూట్‌కేస్ పట్టుకుని నన్ను అనుసరించింది. మా ఇంటి మెట్లు ఎక్కి తలుపు తట్టి "లక్ష్మీ" పిల్చాను.

"ఆయీ" మాట వెనక తలుపు తెరిచి, మా ఇద్దరి వంకా మార్చి మార్చి చూసి లోపలికి వెళ్ళిపోయింది. రాణి ఇంట్లోకి వచ్చి సోఫా పక్కనే సూట్‌కేస్ పెట్టి సోఫాలో కూర్చుంది. ఆమెకు ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నాను.

"స్నానం చేయాలి. బడలికగా ఉంది" అంది రాణి.

"కాఫీ తాగాక చేద్దువుగాని"

అంతలో లక్ష్మి ట్రేలో కాఫీ తీసుకువచ్చి చెరో కప్పు ఇచ్చి లోపలకు వెళ్లిపోయింది.

కాఫీ తాగుతోంటే రాణి అడిగింది "ఎవరీమె?" అని.

కప్పు ఖాళీ చేసేవరకు రాణి కళ్ళల్లోకి చూస్తుండిపోయానే గాని జవాబు చెప్పలేదు.

"ఎవరు?" మళ్లీ అడిగింది.

"నిజం చెప్పమంటావా?"

"చెప్పండి."

ఎందుకో నాకు నిజం చెప్పాలని అనిపించలేదు. నిజం చెప్పి ఉండవలసింది. అహం భావం, తెలివి తక్కువ తనం పుట్టుకతోనే వస్తాయట. అబద్ధం కాకపోవచ్చు.

◆ సాహితీ ప్రియ, మాసపత్రిక - డిసెంబరు 1967